సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 9 । నవంబర్ । 2022



ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత 8లో
- టీటీడీ గాయని కొండవీటి జ్యోతిర్మయి
- ఘనంగా అడవితల్లికి హారతి




మన్యంలో టీడీపీ కనుమరుగు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక 8లో

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ సుభం బన్సాల్ 8లో

చూడచక్కని చంద్రుడు



న్యూస్‌రీల్

తేనెటీగల దాడిలో ఒకరు మృతి

అడుగులపుట్టులో విషాదం

పెదబయలు: తేనెటీగల దాడిలో గిరిజనుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మండలంలోని అడుగులపుట్టు గ్రామానికి కొర్రా చంద్రుబాబు (48) మంగళవారం మధ్యాహ్నం గ్రామసమీపంలోకి పశువులను మేతకు తీసుకు వెళ్లాడు. అక్కడే చెట్టుకొమ్మపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య గతంలో మృతి చెందింది. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తండ్రి మృతితో రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు రాజవొమ్మంగి విద్యార్థులు



మధుకిరణ్‌రెడ్డి



తోలాటి హారిక

రాజవొమ్మంగి: విద్యుత్‌పొదుపు అనే అంశంపై ఎన్టీపీసీ లిమిటెడ్, సింహాద్రి సూపర్ టెర్మినల్ పవర్ స్టేషన్ (పరవాడ, అనకాపల్లి) ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన నిర్వహించే స్టేట్‌లెవెల్ పెయింటింగ్ కాంపిటేషన్‌కు రాజవొమ్మంగికి చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపిక పోటీలో ఏ గ్రూపు విభాగంలో సీహెచ్. మధుకిరణ్‌రెడ్డి, తోలాటి హారిక ఎంపికైనట్లు డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు తెలిపారు.

తాజంగిలో నిలిచిన వినోద క్రీడలు

ఇరువర్గాల మధ్య వివాదం

చింతపల్లి: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తాజంగిలో రెండు వర్గాల మధ్య విభేదాల కారణంగా మంగళవారం వినోద క్రీడలు నిలిచిపోయాయి. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి సమీపంలోని తాజంగి జలాశయం వద్ద కొన్నేళ్లుగా జిప్‌లైనర్, బోటు షికారు వంటి వినోదక్రీడలు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి. ఐటీడీఏ సహాయంతో గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వీటిని సమకూర్చారు. సుమారు 21 మంది యువకులు సంఘంగా ఏర్పడి నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. తమకు కూడా నిర్వహణలో అవకాశం కల్పించాలని మరో 30 యువకులు వివాదానికి దిగారు. దీంతో వినోద క్రీడల నిర్వహణ నిలిచిపోయింది. దీనిపై ఒక వర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినోద క్రీడలు నిలిచిపోవడంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

'ఆహో కాఫీ'తో నాణ్యమైన ఉత్పత్తులు

ఎంపీపీ శెట్టి నీలవేణి



ఆహో కాఫీ బ్రాండ్ ఉత్పత్తులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు

అనంతగిరి: అనంతగిరి హిల్ ఆర్గానిక్స్ 'ఆహో కాఫీ' బ్రాండ్ పేరిట కాఫీ పౌడర్, అటవీ ఉత్పత్తులు, అమ్మకాలు సాగిస్తామమని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలోని ప్రముఖ పర్యాటక పర్యాటక కేంద్రమైన కాఫీ ప్లాంటేషన్ వద్ద ఆహో కాఫీ బ్రాండ్‌ను, ఎంపీపీ, ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ సింహాద్రి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాఫీ రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీడీవో శ్రీహర్షిత్ మాట్లాడుతూ అనంతగిరి, ఎగువశోభ పంచాయతీల్లో రెండు వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోందని, 1300 వరకు రైతులు ఉన్నారన్నారు. వీరంతా సొసైటీగా ఏర్పడి విక్రయాలు చేపడితే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, ఏపీవో అర్జున్, ఈసీ పవన్, కార్యదర్శి రమేష్, సీసీ శ్రీరాములు పాల్గొన్నారు.

కొండను తవ్వి.. బండరాళ్లను నెట్టి..

- స్వేదం చిందించి రహదారుల నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న గిరి శిఖర గ్రామాల గిరిజనులు
- పక్కారోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి వినతి



శ్రమదానంతో రహదారి నిర్మించుకుంటున్న గిరిజనులు

> ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. వారు ఎదురుచూడలేదు.. పలుగు, పార పట్టి.. చేయిచేయి కలిపి స్వేదం చిందించారు. రోజుల తరబడి శ్రమించి కొండలను తవ్వి.. బండరాళ్లను నెట్టి గ్రామాలకు రహదారి నిర్మించుకుంటున్నారు. సాటి గిరి గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. అనంతగిరి మండలంలోని రాచకీల, రెడ్డిపాడు, పాలబంద గిరి శిఖర గ్రామాల గిరిజనులు.

అనంతగిరి: రాచకీల, రెడ్డిపాడు, పాలబంద.. ఇవి పినకోట, పెదకోట, జీనబాడు పంచాయతీల పరిధిలో గిరి శిఖరాన ఉన్నాయి. రహదారి సౌకర్యం లేకకపోవడం వల్ల ఆ గ్రామాలకు చేరుకోవడం చాలా కష్టమే.. ఆ గ్రామాల్లో ప్రాణాలమీదకొస్తే వేరే చెప్పాల్సిన అవసరం లేదు. కిలోమీటర్ల కొద్దీ డోలీలో తరలించాల్సిందే. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న రహదారి సమస్యను పరిష్కరించేందుకు ఆయా గ్రామాల గిరిజనులు దండులా కదిలారు. పలుగు, పార పట్టి శ్రమదానం చిందించారు. రహదారి నిర్మాణానికి ఉపక్రమించారు.

ప్రాణాలమీదకొస్తే..

రాచకీలం, రెడ్డిపాడు, పాలబంద గ్రామాల్లో ఎవరు అనారోగ్యానికి గురైనా గుమ్మంతి మీదుగా చింతపాక వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని తరలించాల్సిందే.

- గత రెండు నెలల్లో రాజకీలం గ్రామానికి చెందిన టి.రాజబాబు, ఎస్.రావులమ్మ, తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. డోలీలో మోసుకొని ఆస్పత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. ఇదే పంచాయతీలో మద్రేబు గ్రామానికి చెందిన సాలమో, కె.రాజులమ్మ అనారోగ్యానికి గురయ్యారు. వీరిని కూడా డోలీలో చింతపాక వరకు మోసుకొని వచ్చి వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అయినా వారి ప్రాణాలు నిలవలేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదన్న ఆలోచనతో ఆయా గ్రామాల గిరిజనులు శ్రమదానంతో రహదారి నిర్మాణానికి సిద్ధమయ్యారు.
- ప్రస్తుతం గుమ్మంతి నుంచి రాచకీలం గ్రామం వరకు ప్రస్తుతం గిరిజనులు శ్రమదానంతో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. రాచకీలం, రెడ్డిపాడు, పాలబంద గ్రామాలకు చెందిన 180 గిరిజనులు నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు. కిలోమీటరు మేర రహదారి నిర్మాణం చేపట్టారు. గుమ్మంతి నుంచి రాచకీలం, రెడ్డిపాడు, పాలబంద వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర రహదారి ఏర్పాటుచేసుకుంటామని వారు తెలిపారు.

ఉపాధి నిధులు పక్కదారి

ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 2012–13లో బల్లగరువు జంక్షన్ నుంచి రాచకీలం, రెడ్డిపాడు, పాలబంద గ్రామాలకు వేతనం నిమిత్తం రూ.21 వేలు, మెటీరియల్ కోసం రూ.9 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు జరగలేదని, రికార్డుల్లో జరిగినట్టుగా అధికారులు అప్పటిలో చూపించారని ఆయా గ్రామాల గిరిజనులు ఆరోపించారు. శ్రమదానంతో నిర్మించుకుంటున్న



శ్రమదానంతో రహదారి నిర్మాణానికి పలుగు, పార పట్టుకుని బయలుదేరుతున్న గిరిజనులు

రహదారిని పక్కాదారిగా నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన కొండబాబు, జన్మరాజు, రాజు, మల్లిదొర, మామిడి నాగరాజు తదితర గిరిజనులు కోరారు.

రూ.20 కోట్లతో పక్కా రోడ్డు నిర్మాణం

గతంలో పినకోట, కివర్ల పంచాయతీలకు చెందిన గిరిశిఖర గ్రామాలైన బోనూరు, చీడిమెట్ట, గడ్డిబంద, టింగెలబంద, జగడలమామిడి గ్రామాలకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందుల పడేవారు. దీంతో రెండేళ్ల క్రితం ఆయా గ్రామాల గిరిజనులు శ్రమదానంతో రహదారి నిర్మించుకున్నారు. సమస్యను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుమారు రూ. 20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. ప్రస్తుతం రోడ్డు ఫార్మేషన్ పనులు జరుగుతున్నాయి.

> **'ఉపాధి' నిధులు వెచ్చిస్తాం**
>
> 
>
> శ్రమదానంతో రహదారుల ఏర్పాటు మంచి పరిణామం. రాచకీలం, రెడ్డిపాడు, పాలబంద గ్రామాల గిరిజనులు రహదారి నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రెండు రోజుల్లో ఆప్రాంతాలను సందర్శించి, వారికి ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీహర్షిత్, ఎంపీడీవో, అనంతగిరి

కాటేజీల నిర్మాణం వేగవంతం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాడగడ వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న పీవో గోపాలకృష్ణ

అరకులోయ రూరల్: మండలంలో కొత్తవలస ఫారంలో చేపట్టిన కాటేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన ఫారంను సందర్శించారు. కాటేజీ పనులను పరిశీలించారు. వీటిని నెలఖరునాటికి ఎలాగైనా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మాడగడ వ్యూపాయింట్‌ను సందర్శించారు. ఈ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు. సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా వాతావరణం కల్పించాలని, మొక్కలు పెంపకం చేపట్టాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, మ్యూజియం మేనేజర్ మురళి, ఎంపీడీవో వెంకటేశ్, ఆదివాసీ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చట్టు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేరుగా రేషన్ బియ్యం సరఫరా

చింతూరు: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు రేషన్ బియ్యాన్ని ఇకపై డీలర్లు నేరుగా సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం ఆయన చింతూరులో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇకపై వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యాన్ని కూడా నేరుగా ఆయా పాఠశాలలకు తీసుకెళ్లి అందచేయాలని ఆదేశించినట్లు జేసీ తెలిపారు.

చోళలో పీఎం.. పోర్టు గెస్ట్ హౌస్‌లో సీఎం

- సర్క్యూట్ హౌస్‌లో గవర్నర్ బస
- ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటనకు చకచకా ఏర్పాట్లు
- వీఐపీల కోసం ప్రధాన హోటళ్లలో గదులు హౌస్‌ఫుల్
- పీఎం భద్రతకు ఐజీస్థాయి అధికారి పర్యవేక్షణలో ఎస్పీజీ విధులు
- 11, 12 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవుల ప్రకటన!
- ఏర్పాట్ల పర్యవేక్షణకు 10న చీఫ్ సెక్రటరీ సమీర్‌శర్మ విశాఖ రాక



ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసేందుకు విశాఖలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. 11న తేదీన విశాఖ చేరుకోనున్న ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ వేర్వేరుగా బస చేయనున్నారు. వీరితో పాటు వచ్చే ప్రముఖుల కోసం ప్రధాన హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల గెస్ట్ హౌస్‌లను కేటాయించారు. సభా ప్రాంగణ వేదికను మొత్తం 10 విభాగాలుగా విభజించి.. ఒక్కో విభాగాన్ని ఒక్కో బృందం పర్యవేక్షించేలా విధులు వేశారు. భద్రత, ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకుని ఒకటిన్నర రోజులు బడులు, కళాశాలలకు సెలవులు ప్రకటించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. మరోవైపు ప్రధాని మోదీ పర్యటన, సభ మొదలైనవి పర్యవేక్షించేందుకు 7 వేల మంది అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించారు.

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో మోదీ బస

ఈ నెల 11వ తేదీ రాత్రి విశాఖపట్నం చేరుకోనున్న ప్రధాని మోదీ తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని చోళలో బస చేయనున్నారు. అదే రోజు రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు గెస్ట్ హౌస్‌లో, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు. బహిరంగ సభకు హాజరయ్యే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కోసం స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, ఆర్‌అండ్‌బీ, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల గెస్ట్ హౌస్‌లతో పాటు ప్రధాన హోటళ్లలో సూట్, ఇతర రూమ్‌లను రిజర్వ్ చేశారు. మొత్తంగా రెండు రోజుల పాటు నగరంలోని ప్రధాన హోటళ్లు వీవీఐపీలు, వీఐపీల తాకిడితో భద్రత నడుమ ఉండనున్నాయి. ప్రధాన మంత్రి భద్రత కోసం ఐజీ స్థాయి అధికారి సురేష్‌తో పాటు 26 మందితో కూడిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ) ఇప్పటికే విశాఖ చేరుకుని భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

ఏర్పాట్లు చకచకా..

12వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే సభ కోసం అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఏఏ విభాగాల్లో ఏఏ అధికారులు విధులు నిర్వర్తించాలనే అంశాలపై మినిట్స్ సిద్ధం చేసి.. 10 రోజులుగా కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు నగరాన్ని, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ బాధ్యతను వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి డి.లక్ష్మారెడ్డి, డీఎల్‌డీవో పూర్ణిమాదేవికి అప్పగించారు. అధికారుల కోసం అదనంగా 50 వాకీ టాకీలను తీసుకొచ్చారు. రెండు రోజుల పర్యటనకు సంబంధించిన మొత్తం 7 వేల మంది అధికారులు, సిబ్బందికి విధులు అప్పగించారు. ఇప్పటికే 6 వేలకు పైగా పాస్‌లను కలెక్టరేట్ వర్గాలు సిద్ధం చేశాయి. మరోవైపు భద్రత, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. 11వ తేదీ మధ్యాహ్నం పూట, 12న మొత్తం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించనున్నారు.

10 విభాగాలుగా సభా ప్రాంగణం విభజన

ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ 12వ తేదీ ఉదయం ఏయూ మైదానంలో నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు.. అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు ఈ నెల 10న చీఫ్ సెక్రటరీ సమీర్‌శర్మ విశాఖ రానున్నారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగానే అధికారులు ప్రాంగణాన్ని 10 విభాగాలుగా విభజించారు. సభావేదిక, ఐదు గ్రీన్ రూమ్స్, వీఐపీ గ్యాలరీ, ప్రెస్ గ్యాలరీ, ప్రజలు, కల్చరల్ ప్రోగ్రామ్స్ వేదిక, లైవ్ టెలికాస్ట్ పాయింట్స్, శానిటేషన్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు.. ఇలా విభజించి సిబ్బందికి విధులు కేటాయించారు. ప్రజల భోజన సౌకర్యం కోసం 10 కేటరింగ్ సంస్థలకు బాధ్యతలు అప్పగించారు.



ఆలస్యంగా సూర్యోదయం

- మన్యంలో ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు
- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 14..
- అరకులోయలో 14.3..
- చింతపల్లిలో 16.5 డిగ్రీల నమోదు

8లో

ఆనందం.. అంతలోనే విషాదం

- సరియా జలపాతంలో జారిపడి యువకుడి మృతి
- అందాలను వీక్షిస్తుండగా ప్రమాదం
- కాపాడేందుకు ప్రయత్నించిన స్నేహితుడు, స్థానికులు
- జలపాతం రూపంలో కబళించిన మృత్యువు



ఆస్పత్రిలో పవన్ మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు



పవన్ (ఫైల్ ఫొటో)

అనంతగిరి: సెలవురోజు కావడంతో సరదాగా గడిపేందుకు వచ్చిన ఆ యువకుల్లో ఆనందం ఎంతోసేపు నిలువలేదు. అప్పటివరకు సందడి చేసిన తోటి స్నేహితుడు జలపాతంలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందడం వారిని కలిచివేసింది. మృత్యువు ఏరూపంలో దాడి చేస్తుందో తెలియదు అనేందుకు ఈ సంఘటనే ఒక ఉదాహరణ. వివరాలిలావున్నాయి. విశాఖ నగరంలోని సీతంటపేటకు చెందిన పోతుల పవన్ (20), ఐదుగురు స్నేహితులతో కలిసి సరియా జలపాతాన్ని తిలకించేందుకు మంగళవారం ఉదయం వచ్చాడు. జలపాతం అందాలను వీక్షిస్తుండగా పవన్ ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడి మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు స్నేహితుల్లో భార్గవ్ అనే యువకుడు జలపాతంలోకి దూకాడు. ఇద్దరు మునిగిపోవడాన్ని గుర్తించిన స్థానికులు, స్నేహితులు వారిని జలపాతం నుంచి అతికష్టం మీద బయటకు తీశారు. భార్గవ్ ప్రాణాలతో బయటపడ్డాడు. పవన్ అపస్మారకస్థితికి చేరుకున్నాడు. తోటి స్నేహితులు హుటాహుటిన అతనిని ద్విచక్రవాహనంపై దేవరాపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతిచెందినట్లుగా వైద్య సిబ్బంది నిర్ధారించారు. అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇలావుండగా తమతోపాటు వచ్చిన స్నేహితుడు ప్రమాదానికి గురై మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు పవన్ ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాలలోని బీబీఎం ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు.

పౌరసేవల్లో జాప్యం తగదు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల పౌరసేవల్లో జాప్యం తగదని, అన్నిశాఖల అధికారులు ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల మ్యుటేషన్ పనులు వేగంగా జరగాలని, ఫ్యామిలీ ధ్రువపత్రాలు నిర్దిష్టమైన గడువులోగా అందించాలని ఆదేశించారు. ఇప్పటివరకు 50గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తికాగా, మిగిలిన ప్రాంతాల్లో సర్వే పూర్తి చేసేందుకు సర్వే, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎఫ్‌టీవోలు జారీ చేసి, గృహ నిర్మాణ లబ్ధిదారులకు ముందస్తుగా రూ.5వేల ఆర్థిక సాయం అందజేయాలని ఆదేశించారు. అన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని, ఉపాధి హామీ పథకానికి సంబంధించి రంపచోడవరం డివిజన్‌లో 35 వేలు, చింతూరులో 20 వేలు, పాడేరు డివిజన్‌లో 55 వేల మందికి ఉపాధి పనులు కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసరాలు పంపిణీలో నిర్లక్ష్యం వహించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్తదానంతో ఆరోగ్యకరమైన సమాజం

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి రక్తదానం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశమందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. రక్తదాతలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. షెడ్యూల్ రూపొందించి జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రక్తదాన శిబిరాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని, దాతలనుంచి రక్తం సేకరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు లేఖలు ద్వారా తగిన ఆదేశాలిస్తామని కలెక్టర్ తెలిపారు. సేకరించిన రక్తపు నిల్వలను జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల్లోని రోగులకు ఈ రక్తాన్ని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్‌ట్రెజరీ అధికారి ఎంవీఆర్ ప్రసాద్ తదితర ఉద్యోగులు 20 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.దయానిధి, రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు శాఖ చైర్మన్ గంగరాజు, ఇతర ప్రతినిధులు ఈశ్వరరావు,అప్పారావు, కోటేశ్వరరావు, సూర్యారావు, సుబ్రమణ్యం,గౌరీ శంకర్, లోహితాస్,మర్ల మణి, వైద్యులు రూపకళ, ధనరాజ్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



ఆస్పత్రిలో వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

హుకుంపేట: ప్రతీ గిరిజన గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.మంగళవారం ఆయన మండలంలోని తీగవలసలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం, 104 సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైపవర్ టెన్షన్‌పై అందరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 104 వాహనంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు రూ.1.5 లక్షలతో పీహెచ్‌సీకి అవసరమైన మందులు, బెడ్‌షీట్లు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. సీడీపీవో దేవి పాల్గొన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినతి



సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

చింతూరు: వైఎస్సార్ క్రాంతి పథంలో గతంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం స్థానిక ఐటీడీఏ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యుల పొదుపు ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు.ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ముత్రం రంగమ్మ, సుబ్బమ్మ, పద్మ, రాములమ్మ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



హాజరైన భక్తులు

- టీటీడీ గాయని కొండవీటి జ్యోతిర్మయి
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన తాజంగి

చింతపల్లిరూరల్/చింతపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని తాజంగి దొంతులమ్మ ఆలయం వద్ద మంగళవారం అడవి తల్లికి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందించుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అత్యధికంగా గిరిజనులు హిందూ ధర్మాన్ని పాటిస్తుండటం ఆనందించదగ్గ విషయమని ఆమె పేర్కొన్నారు. ఆధ్యాత్మిక శ్రద్ధతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.

మార్మోగిన శ్రీరామనామ స్మరణ

అడవి తల్లి హారతి కార్యక్రమానికి పలు ప్రాంతాల నంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. గ్రామంలోంచి కొండమీద ఉన్న ఆలయం వరకు భక్తులు శ్రీరామనామస్మరణతో భజనలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు. జ్యోతిర్మయి ప్రవచనాలు ముగిసేంత వరకు భజన కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఐదున్నర గంటలకు అడవి తల్లికి హారతి సమర్పించారు. ఈ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

వై.రామవరం: మండలంలో మంగళవారం రంపచోడవరం సబ్‌కలెక్టర్ సుభం బన్సాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. సమస్యలను, వైఎస్సార్ సమగ్ర భూసర్వే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పి.యర్రగొండ గురుకుల బాలికల జూనియర్ కళాశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వారి సామర్థ్యాలను పరీక్షించారు. మెనూ, ఆహార పదార్థాన నాణ్యతను పరిశీలించారు. ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహార పదార్థాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని వాన మామిడిగొందిలో చేస్తున్న వైఎస్సార్ సమగ్ర భూసర్వేను పరిశీలించారు. సర్వే విధానంపై సలహాలు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కె.సుధాకర్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు. ఆర్ఐ ఎ.తాతారావు, సర్పంచ్ పల్లాల రాజేశ్వరి, సర్వేయర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా సూర్యోదయం

సాక్షి,పాడేరు: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు కూడా దట్టంగా కురుస్తుండడంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 14.3 డిగ్రీలు చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. చింతపల్లిలో సోమవారం 15.2 డిగ్రీలు నమోదు కాగా మంగళవారం నాటికి కాస్త పెరిగాయి. పొగమంచు తీవ్రత, చలిగాలులతో జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉన్ని దుస్తుల వినియోగంతో పాటు, చలిమంటలను ఆశ్రయించారు. ఉదయం 10గంటల తరువాత మన్యంలో సూర్యోదయం అయ్యింది. పర్యాటక ప్రాంతాల్లో మంచు అందాలను మాత్రం చలిగాలులలోనే పర్యాటకులు వీక్షించారు.



రాజవొమ్మంగిలో కమ్మిన మంచుతెరలు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఉదయం మంచు దట్టంగా కురిసింది. స్థానికంగా కనిష్టంగా 20 డిగ్రీలు, గరిష్టంగా 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది.

మన్యంలో టీడీపీ కనుమరుగు

పెదబయలు: మన్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనంతో టీడీపీ కనుమరుగు తథ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని లక్ష్మీపేట శివారుకు చెందిన మండల టీడీపీ ఉపాధ్యక్షుడు రామన్న, వార్డు సభ్యుడు భీమన్నతో పాటు టీడీపీకి చెందిన 79 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనకు ఏజెన్సీలో టీడీపీ కంచుకోటలు బద్దలవుతున్నాయన్నారు. జెడ్పీటీసీ కె.బొంజుబాబు పాల్గొన్నారు.

తండ్రికి తల కొరివి పెట్టిన తనయ

చోడవరం రూరల్: తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం చోడవరంలో చోటు చేసుకుంది. పట్టణంలో పల్లేల పోతురాజు గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. పెద్దమ్మాయి జయశ్రీ మంగళవారం తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. పోతురాజు మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చోడవరం ఎమ్మెల్యేగా చేసినప్పటి నుంచి ఆ కుటుంబంతో సన్నిహితంగా మెలిగేవారు. అనకాపల్లి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పరుచూరి భాస్కరరావుకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. ఎంతో నమ్మకస్తునిగా వ్యవహరించిన పోతురాజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో తరలి వచ్చిన పరుచూరి భాస్కరరావు ఎలాంటి బంధుత్వం లేకపోయినప్పటికీ పోతురాజు పాడెను భుజానికెత్తుకుని మోయడం ద్వారా తన అభిమానాన్ని చాటుకున్నారు. మృతుడు భార్య లక్ష్మి, కుమార్తెలు జయశ్రీ, లతశ్రీలను ఓదార్చారు. పల్లేల మృతి పట్ల పలువురు సంతాపాన్ని తెలిపారు.

హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

అరకులోయ రూరల్: హౌసింగ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల హౌసింగ్ డీఈ, ఏఈలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. అధికారులంతా సమన్వయంగా పనిచేస్తూ నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు మూడు మండలాల పరిధిలో 1,652 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 1304 ఇళ్ల పనులు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. మిగతా ఇళ్ల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, హౌసింగ్ డీఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో గోపాలకృష్ణ

ఆలయ భూముల వివాదంపై సమావేశం

చింతూరు: స్థానిక డివిజన్ పరిధిలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న 917 ఎకరాల భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు సంబంధించిన వివాదంపై మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, భద్రాచలం దేవస్థానం ఈవో శివాజీలు ఆయా ఆలయ భూముల్లో ప్రస్తుతం పొజిషన్లో ఉన్న వ్యక్తులతో చర్చించారు. భూముల వివాదానికి సంబంధించిన వాస్తవాలను వారు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సదరు భూములు ఆక్రమణకు గురయ్యాయని దేవస్థానం అధికారులు వాదిస్తుండగా, ఆ భూములు తమవని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 2001లో అప్పటి త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆయా భూములు తమకు చెందుతాయని గ్రామస్తులు అధికారులకు వివరించారు. కాగా 2011లో ప్రభుత్వ జీవో ప్రకారం గ్రామస్తులు సదరు భూములు లీజుకు తీసుకుని పైకం చెల్లించాలని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆ భూముల్లో యథాతథ స్థితిని కొనసాగించాలని కోర్టు ఆదేశాలున్నాయని, తుది తీర్పు అనంతరం సదరు భూములకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ తెలిపారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

సారా రహిత పంచాయతీగా తీర్చిదిద్దుదాం

అనంతగిరి: చిలకలగెడ్డ పంచాయతీని సారా రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ దాస్ అన్నారు. మంగళవారం మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీలోని సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 400 లీటర్ల పులుపును ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్ఐ దాస్ తెలిపారు. అనంతరంసారా వల్ల కలిగే అనర్థాలపై గ్రామంలో గిరిజనులకు ఎస్ఐ దాస్ అవగాహన కల్పించారు. సారా నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.



పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్ఐ దాస్

ఆలయాల్లో సంప్రోక్షణ

సాక్షి,పాడేరు: చంద్రగ్రహణంతో పాడేరులోని మోదకొండమ్మతల్లి, అరకులోయలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, మత్స్యగుండంలోని పవిత్ర మత్స్యలింగేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు. గ్రహణం వీడిన తరువాత మంగళవారం రాత్రి గర్భగుడులను తెరిచి సంప్రోక్షణ నిర్వహించారు.



రోలుపై నిల్చున్న రోకలి



మోదకొండమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రోలుపై నిల్చున్న రోకలి

సీలేరు: చంద్రగ్రహణం నేపథ్యంలో జీకేవీధి మండలం సీలేరు గ్రామంలోని 6వరోడ్డు క్రాస్‌లో ఏపీజెన్‌కో ఉద్యోగి నాగరాజు ఇంట్లో రోలుపై రోకలి నిల్చుంది. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6.20 వరకు రోకలి నిల్చుని ఉంది. గ్రహణం అనంతరం పడిపోయింది. ఈ దృశ్యాన్ని నాగరాజు చిత్రీకరించి గ్రూపుల్లో పోస్టు చేశారు.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎంపీపీ రమేష్

కొయ్యూరు: మావోయిస్టుల అడ్డాలోకి వైఎస్సార్ సీపీ నాయకులు అడుగుపెట్టారు... ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న మండలంలోని బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లిలో మంగళవారం ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, నేతలు గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో ప్రభుత్వం ద్వారా 126 మందికి మంజూరైన ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయడం చరిత్రాత్మకమన్నారు. ఏజెన్సీలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని, సంక్షేమాన్ని జగనన్న ప్రభుత్వం చేసి చూపెడుతోందన్నారు. శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పనకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులందరికీ హక్కులు కల్పించి ప్రభుత్వం పట్టాలు అందజేయడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో ఎంపీ,ఎమ్మెల్యేల సాయంతో ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ద్వారా కల సాకారం అయిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబులు, సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, వార్డు సభ్యుడు సంజీవ్, నాయకుడు రాజు, వీఆర్వో భీమన్నదొర, కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకింద చదువులు.. స్నేహితుల చొరవతో వెలుగులు

గూడెంకొత్తవీధి: మండలంలోని శివారు గ్రామం చిన అగ్రహారం... ఇక్కడ ఎంపీపీ పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.. కానీ పాఠశాలకు 20 ఏళ్లుగా సొంత భవనం లేదు. ఇన్నాళ్లూ చింతచెట్టు నీడలో విద్యార్థులు చదువులు కొనసాగించారు. అధికారుల చుట్టూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిరిగినా.. నేటి వరకూ పాఠశాల నిర్మాణానికి ముందడుగు వేయలేదు. ఈ విషయంపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వచ్చాయి. అయినా అధికారుల్లో కదలిక లేదు. దీంతో ఎట్టకేలకు గూడెంకొత్తవీధి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే దావూద్ స్పందించారు. అతని స్నేహితుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో 'మై స్టూడెంట్స్ అసోసియేషన్' కె.మల్లవరం (2000-2003 పదోతరగతి బ్యాచ్) విద్యార్థులు ఏకమయ్యారు. వారంతా రూ.50వేల నిధులు సేకరించారు. ఆయా నిధులతో గ్రామంలో ప్రస్తుతం విద్యార్థులకు పాఠశాల కోసం రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. దీంతో విద్యార్థులకు వసతి సమస్య తీరనుంది. స్నేహితుల సహకారంతో తమ గ్రామానికి పాఠశాల నిర్మించేందుకు కృషి చేసిన కో-ఆప్షన్ సభ్యుడు దావూద్‌ను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.



చిన అగ్రహారంలో తాత్కాలిక పాఠశాల షెడ్డు వద్ద విద్యార్థులు

జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలకు దరఖాస్తులు

కొయ్యూరు: యువజన సర్వీసుల శాఖ జిల్లాస్థాయి యువజనోత్సవాలను 25న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ మంగళవారం తెలిపారు. ఆమె విలేకరులతో మట్లాడుతూ 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జానపద నృత్యాలు(20మంది సభ్యులు)జానపద గీతాలు(పది మంది సభ్యులు)తో పాల్గొనవచ్చన్నారు. వన్ యాక్ట్ ప్లే,(12మంది) వక్తృత్వ పోటీలు ఎక్స్‌టెంపర్, హిందీ, ఆంగ్లంలోను, సంప్రదాయ గాత్రం హిందుస్తానీ, కర్నాటకలోను, సంప్రదాయ నృత్యం మణిపురి, కథక్, కూచిపూడి, భరతనాట్యంలోను, సంప్రదాయ వాయిద్యాలు పిల్లనగ్రోవి, వీణ, సితార, మృదంగం, తబలాలు కర్ణాటక, హిందుస్తానీ రాగాల్లో చేయాలని తెలిపారు. హార్మోనియం లలిత సంగీతం బాణీలో ఉండాలని,గిటార్ భారతీయ లేదా వెస్ట్రన్‌లో ఉండాలన్నారు. ఈనెల 23లోగా దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయాలని అందజేయాలన్నారు. యువజన తేదీని 25న నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు సొంత ఖర్చులు భరించాలన్నారు. ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్రానికి, అక్కడ నుంచి జాతీయ స్థాయికి అర్హత సాధిస్తారన్నారు.

వేగవంతంగా నాడు-నేడు పనులు

మారేడుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులను రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో నిర్మించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఏకలవ్య మెడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధన, మెనూ అమలుతీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసు, ఎంపీడీవో వీరకిషోర్ ఉన్నారు.



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే